# షేక్‌హ్యాండ్

శశిశ్రీ

మోహన్‌రెడ్డి యింతకు వడిగట్టాడు అనుకోలేదు - అనుకున్నాడు సాదు శంకర్ నారాయణ.

తాను ఎంత బిసి అయితే మాత్రం అంత బలహీనంగా వున్నానా!? అతని చొరవ ఏం బాగు లేదు! ఇంటికొచ్చిన మనిషి కదా అని వూరుకున్నానే కానీ, అదే వేరే తావునైతే అతని తల తిరిగి పోయేట్లు మాట్లాడేవాణ్ణి.. ఇలా ఆలోచిస్తుండటంతో శంకర్‌కి నిద్రపట్టిందికాదు. జరిగిందంతా గుర్తుకు రాసాగింది.

***

లెక్చరర్‌గా రిటైర్ అయిన దగ్గర్నుంచి శంకర్‌కు పనులెక్కువైనాయి. పనివుండే వానికి ఒకటేపని- పనిలేనివానికి అన్నీ పనులే అన్నట్లయ్యింది అతని పరిస్థితి.


రెండు దినపత్రికల్లో రెండు శీర్షికలు రెండేళ్ళుగా ఎత్తిన కలం దించకుండా రాస్తున్నాడు. వారపత్రికలు, మాసపత్రికలు ఏవి తిరగేసినా సాదుశంకర్ రాసిన కథలే! బిసిల జీవితాలలోని ఎన్నోకోణాల్ని వెలికితీసి అక్షరబద్ధం చేస్తున్నాడు.

పాఠకుల ఉత్తరాలు, విమర్శకుల ప్రశంసలు ముమ్మరంగా రాబట్టాయి. అడపాదడపా ఎలక్ట్రానిక్ మీడియాలో చర్చాగోష్టుల్లో పాల్గొంటున్నాడు. ఒక రచయితగా, ఒక విద్యావేత్తగా, ఒక మేధావిగా, బిసిల ఆత్మబంధువుగా నాలుగేళ్లకే పేరు తెచ్చుకున్నాడు.

ఉన్న ఒక బిడ్డ కళావతిని లెక్చరర్‌కిచ్చి వున్నంతలో బాగానే పెండ్లి చేసి పంపాడు. ఎంబిఏ చదివి - రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తానన్న ఒక్కగానొక్క కొడుకు సాకేత్‌ని తన రిటైర్మెంట్ ద్వారా వచ్చిన ఏడు లక్షలు యిచ్చి ప్రోత్సహించాడు.

ఈ నాలుగేళ్లలో సాకేత్ హైదరాబాద్ సిటీలో.. పదిమందిని మింగిన అనకొండలా ఎదిగినాడు. సర్వ ఆశ్రయ్ రియల్ ఎస్టేట్స్ సంస్థ పెట్టి బలంగా పుంజుకుంటున్నాడు.

కావాల్సినంత వీలు వ్యవధి చేతిలో వుండటంతో శంకర్ చెలరేగి రచనలు చేసేస్తున్నాడు. బిసిల సమస్యలపై రాసిన వ్యాసాలను రెండుపుస్తకాలు.. బీసీల జీవితస్థితిగతులను గురించి రాసిన కథలు రెండు పుస్తకాలుగా ముద్రించి ఆవిష్కరణ సభ కడప కళాక్షేత్రంలో భారీగా పెట్టాడు.



ఆవిష్కరణ సభకు రాష్ట్రం నలుదిక్కుల నుంచి రచయితలు, విమర్శకులు రావడమే కాక - ఒక ఎస్‌సి, ఒక బిసి మినిస్టర్లు యిద్దరూ వచ్చారు. బిసి సంఘాల నాయకులూ హాజరైనారు.

సాహిత్యసభకు కులసంఘాల నాయకులు, అధికార పార్టీ మంత్రులు రావడంతో కొందరు రచయితలు- శంకర్ కొంపదీసి ఎమ్మెల్యేగా పోటీచేస్తాడో ఏమో అని అనుకున్నారు. కొందరైతే చనువు కొద్ది పైకి అడిగేశారు కూడా.

సరిగా అప్పుడు రాజకీయ బీజం శంకర్ మనసులో బిసి సంఘాల నాయకులు కొందరు వేశారు. ఎమ్మెల్యేగా కాదు కానీ ఎమ్మెల్సీగా ఎందుకు నిలబడకూడదన్నారు.

మొహమాటంకొద్ది ముందు తనకా వుద్దేశం లేదన్నాడు. తీరా ఎమ్మెల్సీల నోటిఫికేషన్ విడుదల అయ్యాక మెదడులో పురుగు తొలవడం మొదలైంది.

గ్రాడ్యుయేట్ కాన్‌స్టిట్యుయెన్సీ నించి పోటీ చేస్తే సరి. అంతా చదు

వుకున్నోళ్ళే ఓటర్లు. వున్నకాడికి చైతన్యస్థాయి వుంటుంది వాళ్లకు. పైగా- ఏ పార్టీ అభ్యర్థిగా తాను నిలిచేది లేదు. ఫలానా పార్టీ అభ్యర్థిని అని రంగువే యడానికి సాధ్యంకాదు.

రచనా వ్యాసంగం తప్ప మిగిలిన టైం అంత ఏం చేసుకోను? ఇంతగా ఫ్రీ టైం వున్నప్పుడు ఏ సత్‌సంఘమో... ఏ క్లబ్బో అని టైమ్ కిల్ చేయ కుండా ఎమ్మెల్సీగా పోటీ చేస్తే సరి. శాసనమండ లిలో నిరుద్యోగుల గొంతుక తానై, వాళ్ళ వాణిని గట్టిగా వినిపించవచ్చు అనుకొన్నాడు శంకర్.

నలుగురైదుగురు మిత్రుల్ని కలిసి తన మనోగతం చెప్పిచూశాడు. "రాజకీయాలు మనలాంటి వాళ్ళ కెందుకబ్బా!" అని కొందరు.. "అదృష్టం కల్సి వస్తుందనుకుంటే కానివ్వు" అని మరికొందరు.. "బెస్ట్ థింకింగ్ సార్. మన బిసి సంఘాల్నంతా ఏకతాటిపై తెస్తాం. మీకెందుకు మేం ముందు వుంటాం - మీరు రెడీ కాండీ" అని బిసి సంఘాల నాయకులు ప్రోత్సహించారు.

ఎన్నిరకాలుగా ఆలోచించినా పోటీ చేయడం మంచిదే అనిపించింది శంకర్‌కు. రచయితకు రచయిత, గ్రాడ్యుయేట్‌కు గ్రాడ్యుయేట్, బిసికి బిసి- పైగా వివాదాలు లేని వాణ్ణి- ఇంక గెలుపు నాకు కాక ఎవనికి దక్కుతుంది - అనుకున్నాడు.

"మేస్త్రీని నమ్మి - ఇల్లు కట్టుకోడానికి దిగినట్లవుతుంది. మన అంచున అంత వుసి ఎక్కడిది! ఇవన్నీ డబ్బు సంగతులు. మనకు తేరగా వచ్చిన డబ్బులు లేవు. బ్లాక్‌మని వుంటే - ఎలక్షన్స్‌లో రాణిస్తాం. కష్టపడి సంపాదించి కొంచెం పుంజిగా వుండాం. మన దగ్గర వుండేది పోగొట్టుకుంటే మళ్ళీ సంపాదించు కోలేం. బాగా ఆలోచించుకుని దిగు. దిగినాక బాగుండదు - నామోషి అయిపోతాం." కొడుకు సాకేత్ ఫోన్లో ఎంతగానో వారించాడు శంకర్‌ను.

"పిల్లోడు కదా! వాని భయం వానిది. ఎలక్షన్స్ అంటే డబ్బులు తప్పక అవసరమే. కానీ, తనకు యింకొకళ్లకు తేడా వుంది. అవతలి వాళ్ళకు లక్ష అయితే తాను పదివేలు పెట్టే చాలు అల్లకల్లోలం చేసేయ్యవచ్చు. అంతగా సాకేత్ తను సంపాదించిన డబ్బులు యివ్వలేకపోతే పోనీ. తాను పెట్టుబడిగా యిచ్చిన ఏడులక్షలు టయానికి పురమాయిస్తే చాలు' - అని అనుకునే ఎన్నికల బరిలోకి దిగినాడు శంకర్.

ఒక్క నామినేషన్ వేసినరోజునే మూడు లక్షలు కర్పూర హారతై పోయాయి. ఏదో ఇరవై, ముప్పయ్ వేలతో అయిపోతుందనుకునింది - మూడు లక్షలు అయింది. నామినేషన్ రోజే సత్తా చూపాల్సింది. బెస్ట్ ఎంట్రీ బెస్ట్ లక్ అవుతుంది - అని ఎవరో సలహా యిచ్చారు. దీంతో శంకర్ ఖర్చు బాగానే పెట్టినాడు.

ఖర్చు అయితే అయ్యింది కానీ, పేరు బ్రహ్మాండంగా ప్రచారంలోకి వచ్చేసింది. ఎన్నోఏళ్ళు కష్టపడితే కానీ రచయిత అనిపించుకోవడం కష్టమైంది. ఈ ఎమ్మెల్సీ ఎలక్షన్స్‌లో కొద్ది రోజులకే ప్రచారంలో నలుగురినోళ్ళలో తన పేరు నానుతోందనుకున్నాడు శంకర్. అందివచ్చే ఈ సందర్భాన్నీ దొరకపుచ్చుకోవడమే మంచిది అనుకున్నాడు.

ధృఢంగా, స్థిరంగా, ఎత్తుగా నల్లగా బట్టతలతో వుద్యమకాలం నాటి నెల్సన్‌మండేలా మాదిరి వుండిన శంకర్ - ఈ ఎమ్మెల్సీ ఎలక్షన్స్ ప్రచారం కోసం కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల వెంట రేయింబవళ్ళు తిరగడంతో - జైలుకు పోయి బక్కచిక్కిన సొట్టబుగ్గల నెల్సన్‌మండేలా మాదిరిగా మారిపోయాడు. నీడపట్టు బతుకు వదలి - ఎండల్లో తిరగాల్సి వచ్చింది.

మూడు జిల్లాల్లో హోర్డింగులు, వాల్ పోస్టర్లు, కరపత్రాలు, బాడుగ బండ్లకు డీజిళ్ళు, వాటి బాడుగలు, రోజుకు యాభై మందికి దినఖర్చులు, లాడ్జీల్లో రూముల బాడుగలు, పత్రికల్లో అడ్వర్టయిజ్‌మెంట్లకు ఖర్చులు... రాత్రికాగానే కేసులకుకేసులు మందుసీసాలు నెల తిరక్కుండానే ఎగశ్వాసతీసుకోవాల్సి వస్తోంది శంకర్‌కు.

ఊరికే వున్న ప్రాణానికి వురివేసుకున్నట్లయ్యిందే నా పరిస్థితి అని ఎన్నిమార్లు అనుకున్నాడో.

డబ్బులు లేంది ఏ పని సాగదు ఎలక్షన్స్‌లో ప్రతిదానికి డబ్బే డబ్బే...

హైదరాబాదుకు రాత్రికి రాత్రే బయల్దేరాడు - తన కొడుకు సాకేత్ కోసం - కాదు అతను యిచ్చే డబ్బు కోసం. సాకేత్ వాళ్ళ - సర్వాశ్రయ్ ఆఫీసుకు వెళ్ళి కూర్చున్నాడు.

ఎదురుగా కూర్చున్నాడు సాకేత్. ఎలా మొదలు పెట్టాలో శంకర్‌కు పాలుపోలేదు. ఆ పరిస్థితిని వెంటనే గుర్తించాడు సాకేత్.

"ఏం నాన్నా! మళ్ళీ డబ్బు అక్కరపడిందా!?" సరాసరి విషయంలోకి వచ్చేశాడు సాకేత్.

"అవునబ్బీ! ఓ అయిదులక్షలుంటే ఆడాడికి సర్దుబాటు అవుతుంది. ముందు ఇంతగా ఖర్చు చేయాల్సి వస్తుందనుకోలేదు. తీరా దిగే కొద్ది విషయం అర్థమౌతూ వుంది." బాధగా అన్నాడు.

"రాజకీయమంటే - ముందు డబ్బుబలం - వెనుక కులబలం - లేకుంటే బతుకు బంగాళాఖాతం - అని మీ కవులే చెప్పారు కదా నాన్న. ఇప్పుడు అనుకోని ఏం లాభం. ఆ ఆలోచన ముందే వుండివుంటే బాగుండేది." అన్నాడు సాకేత్.

"డబ్బు మన అంచున భారీగా లేకపోయినా ఒక మాదిరి సర్దుబాటు చేసుకోగలం అనుకున్నా. ఇక కులబలం అంటావా.. బిసి కులాలంతా ఏకమైతే ఇంక ఎదురేముంది అనుకొనిన. అయినా యిప్పుడు మనం బరిలో గట్టిగా వుండాంరా అబ్బీ! ఒక అనంతపురంలో ఏంటి, ఒక కర్నూలులో అయితే ఏంటి - ఇంక మన కడపలో నీకు తెలియంది ఏముంది? బిసిల్ని బాగా ఏకం చేసినాం. ఒకో జిల్లాని మూడేసి చుట్లు కొట్టినాం. అందర్లో బిసిల చైతన్యం తేగలిగాం" వీలయినంత కన్విన్సింగ్‌గా చెప్పాడు శంకర్.

"సరే నాయనా! అయిదు లక్షలు రెడీ చేస్తా తీసుకెళ్ళు" నిర్లిప్తంగా చెప్పాడు సాకేత్.

"అట్నేలేరా అబ్బీ! ఇంగ డబ్బుతో పెద్దగా అవసరం రాకపోవచ్చులే! అయినకాడికి దీంట్లోనే సర్దుబాటు చేస్తా" అన్నాడు.

"నాన్నా!..." అని శంకర్ మొహంలోకి చూశాడు.


"ఏం సాకేత్!?" అడిగాడు.

"ఈ నా వ్యాపారం కోసం నీవు ఏడు లక్షలు పెట్టుబడిగా ఇచ్చావు. ఆ ఏడుకు ఏడు వేసి, పద్నాలుగు లక్షలు ఇచ్చేసినాను. ఇప్పుడు అయిదు సర్దుబాటు చేస్తాను. మొత్తం 19 లక్షలు నీ ఎమ్మెల్సీ ఎలక్షన్ కోసం తీసుకున్నట్లవుతుంది. ఇంక ఏమైనా సర్దుబాటు కావాలంటే నాకు చేతకాదు. ముందే చెప్తుండా నాన్న - ఏమనుకోగాకు" నిక్కచ్చిగా చెప్పేశాడు సాకేత్.

"అట్నే కానీ లేరాబ్బీ!" కాకపోతే - పదిలక్షలు ఖర్చుచేసి ఓడిపోవడం కంటే - ఇరవైలక్షలు పెట్టి గెలవడం మేలు కదా అని ఈ ఖర్చయినా పెట్టున్నాం. దిగకుండానే వుండాల. దిగినాక సల్లకుంటే ఎట్లా? అన్నాడు.

"నాన్నా! నిజంగా నీకు గెలుస్తాననే నమ్మకం వుందా!?" సూటిగా కళ్ళలోకి చూస్తూ అడిగాడు సాకేత్.

"బిసి ఈక్వేషన్‌తో రంగంలోకి దిగినాం. నామ



టుకు నాకు చాలా మేరకు సక్సస్ అయినట్లే కనిపిస్తోంది. ఇంగ కొన్ని రోజులు టైం వుంది. చూస్తాం. అంతా మంచే జరుగుతుందనుకుంటున్నా'' శంకర్‌కు ఎక్కడో అపనమ్మకం ధ్వనిస్తుండగా అన్నాడు.

''సరే! నాకుమాత్రం గెలుస్తావని నమ్మకం లేదు. ఇప్పటికే ఒక కోటిదాకా ఖర్చు చేసిన వాళ్ళు ముగ్గురు వున్నారు. ఇంకా ఖర్చు చేస్తారు. మొబయిల్ ఫోన్లు, డివిడిలు యివ్వబట్టే – మనబోటోళ్ళం ఎక్కడ తట్టుకుంటాం నాన్నా?!'' మనసులో దాపరికం లేకుండా చేదునిజం కక్కాడు సాకేత్.

ఈలోగా శంకర్ సెల్‌ఫోన్ రింగైంది. స్క్రూట్నీ రేపే ఎక్కడైనా పొరపాట్లు జరిగి వుంటే ఎత్తిపోతాం వెంటనే రమ్మని సెల్‌ఫోన్ పిలుపు. ఎక్కడైన పొరబాట్లు జరిగివుంటే అనే మాటలు చిరాకు కలిగించాయి.

''సర్లేరా! నిండా మునిగినాం – ఇక చలి అంటే ఎట్లా? డబ్బు ఇవ్వు'' అన్నాడు గంభీరంగా.

సాకేత్ తన సూట్‌కేస్ తీసి అయిదు కట్టలు ఇచ్చాడు. అన్నీ పరపరలాడే కొత్త ఎర్ర వెయ్యి రూపాయల నోట్లే! ఆ కట్టల్ని తన సూట్‌కేస్‌లో పెట్టుకుని బయటికి నడిచాడు శంకర్.

***

సుమో ముందుకు కదిలింది. సిటీ లిమిట్స్ దాటి కడప రహదార్లో వెళ్తోంది. డ్రైవర్ పక్కసీట్లో శంకర్ కూర్చున్నాడు. వెనుక బిసి సంఘాల నాయకులు.

ఎవరు మాట్లాడుకోవడం లేదు. నిశ్శబ్దం బరువుగా తోచింది డ్రైవరుకు. స్టీరియోలో క్యాసెట్ పెట్టి – స్విచ్ ఆన్ చేశాడు.

''జిందగి ఏక్‌సఫర్..హై సుహానా..కల్‌క్యా హోగా..కిస్‌నెజానా''

'జీవితం ఒక అందమైన ప్రయాణం..తెలియదెవరికి రేపటి వైనం'

ఐనా, రేపు ఏం జరుగుతుందో తెలిస్తే – మనిషి బ్రతుకు ఎందుకిలా వుంటుంది? ఎంతో ప్రగతి సాధించాడు మనిషి. కానీ, రేపు ఎలా వుంటుందో మాత్రం చెప్పలేడు. చిత్రమే కదా.. అని మనసులో అనుకున్నాడు.

ఎంత వద్దనుకుంటున్నా మాటిమాటికి సాకేత్ మాటలే శంకర్‌కు చెవుల్లో గింగిర్లు కొట్టున్నాయ్.

ఏమైనా– సాకేత్ ప్రాక్టికల్ ఫెలో, భావుకత్వంలో జీవించడం వానికి అసలు పట్టదు. మరి తానో ఎమ్మెల్సీ కల కన్నాడు. ఆ కల చిన్నగా ఆశగా మారింది. ఆ ఆశ కార్యాచరణగా మారింది. ఆ కార్యాచరణ అమలు చేయడంలోనే సాధక బాధకాలు వూహించని విధంగా ఎదురౌతున్నాయ్. ఈ అమలు విషయంలో విజయం పొందితే – ఇంకేముంది? శ్రమకు తగ్గ ఫలితం దానంతకు అది సిద్ధిస్తుంది.


అప్పుడు అందరూ మెచ్చుకుంటారు, అభినందిస్తారు, సన్మానిస్తారు. విజయం ద్వారా లభిస్తుంది అధికారం. ఆ అధికారానికి అందరూ గౌరవ మర్యాదలు యిస్తారు.

''మాకు ముందే తెలుసు మీరు గెలుస్తారని'' అని చాలామంది అంటారు. ముందుగా తెలియకపోయినా, అధికారం ముందు ఆవిధంగా చెప్పడమే లోకరీతి లోకనీతి.

ఒకవేళ – ఓడిపోతేనో..మనసులోంచి ఒక చేదు అల లేచి – గొంతుక చివరి దాకా చేదు రుచి కలిగించింది. పొరబాటున ఓటమే ఎదురైతే అది చేకూర్చే మానసిక విధ్వంసం...అందులోంచి బయట పడ్డానికి చాలా సమయమే పట్టుందనుకున్నాడు.

సెల్‌ఫోన్లు, డివిడిలు, ఓటుకు వెయ్యి రూపాయలు నగదు ఎలా పట్టే అలా యిసిరేస్తున్నారు. లక్షలు పోయి.. ఇప్పుడు రెండు మూడు కోట్లు అవలీలగా ఖర్చుపెట్టున్నారు. ఎక్కడ్నించి వస్తోంది ఈ డబ్బు! ఇంత బరితెగించి ఖర్చు చేస్తున్నారే రేపు గెలిచాక – వీళ్ళు ప్రజాసేవ చేయమంటే ఏం చేస్తారు.

కోట్లు పెట్టి గెలిచినవాడు – గెలిచిన రోజునించే




కోట్లు సంపాదించడానికి సిద్ధపడ్తాడు... ఎందుకు పడడు? రాజకీయం కూడా వ్యాపారమే అయిపోయినప్పుడు – వ్యాపారంలో లాభాలు ఆశించడం తప్పుకాదు కదా!

ఇవన్నీ చూస్తుంటే పోటీ నించి తప్పుకోవడమే సుఖంగా వుంటుందేమో. చూస్తూ చూస్తూ ఎలా తప్పుకునేది.

స్క్రూట్నీలో ఏదో ఒక టెక్నికల్ రీజన్ మీద తన నామినేషన్ ఎత్తిపోతే పీడ విరగడయి పోతుందనుకున్నాడు శంకర్.

కానీ స్క్రూట్నీలో అంతా సవ్యంగా వుందనే తెలిపోయింది. అంతా అనుకున్నట్లే జరిగిపోతే ఇంకేముంది.

కురిసిన ప్రతి చినుకు ముత్యం కాదు. పూసిన ప్రతి పువ్వు పండు కాదు.

యుద్ధంలో దిగినాక కత్తి లేదంటే ఎలా? ఎన్నికలంటే బ్యాలెట్ యుద్ధమే! డబ్బే కత్తి!! ప్రాణాల్ని వడ్డి పోరాడ్డమే – వెనిక్కి సల్లుకునేది లేదు. ఏమైతాదో కానీ అనుకున్నాడు శంకర్ స్థిరంగా.

సరిగ్గా పోలింగ్ తేది నాలుగు రోజులు వుందనంగా శంకర్ ఇంటికొచ్చాడు – మోహన్‌రెడ్డి.

మోహన్‌రెడ్డి వచ్చినప్పటికి – సెల్‌ఫోన్ల ద్వారా గ్రాడ్యుయేట్ ఓటర్లకు షార్ట్ మెసేజ్ సర్వీసు ఎలా పంపాల్నో చర్చించుకుంటున్నారు.

ఆయన్ను చూసి అంతా నిర్ఘాంతపోయారు. ఎన్ని కలబరిలో సరిపోటీదారుడైన అభ్యర్థి ఇలా రావడం ఏమిటి? ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

ఏమైతేనేం – తన ఇంటి గడప తొక్కివచ్చాడు. శత్రువైనా ఆహ్వానించాల్సిందే అనుకున్నాడు శంకర్.

''ఆఁ రండి సార్. ఏం ఇలా వచ్చారు!?'' అన్నాడు శంకర్.

''మీతో పర్సనల్‌గా మాట్లాడుకుందామని వచ్చాను...?''

అందర్నీ చూస్తూ అన్నాడు మోహన్‌రెడ్డి.

కొంచెం తటపటాయించిన వెంటనే తేరుకుని...

''ఓ అలాగే సార్.. రండి ఇలా యాంటి రూమ్‌లో కూర్చోని మాట్లాడుకుందాం'' అన్నాడు.

యాంటిరూమ్‌లోకి పోయారు. బయట అప్పుడే ప్రెస్ ఫోటోగ్రాఫర్లు, కెమెరామెన్లు చేరిపోయారు.

''కాఫీ తీసుకుంటారా!'' మర్యాద కోసం అడిగాడు శంకర్.

''ప్చ్. అక్కర్లేదు సార్.. ఈ ఎలక్షన్స్‌లో భోజనాలు కాఫీలు చూసుకుంటే యాడ అవుతుంది.'' తన అవస్థను చెప్పాడు.

''వూఁ చెప్పండి సార్...''

''మరేం లేదు. ఈ ఎమ్మెల్సీ ఎలక్షన్స్‌లో దిగినాంక దీని లోతు ఎంతో ఈ పాటికే మీకు అర్థమైపోయి వుంటుంది. ఒక ఎమ్మెల్యే సీటు కోసం పోటీ చేస్తే మహా అయితే మూడు లేదా నాలుగు మండలాలు కలిపితే ఒక నియోజకవర్గం అయిపోతుంది. మహా ఎం.పి. నియోజకవర్గం అనుకున్న ఏడు సెగ్మెంట్లు వుంటుంది. దీనెమ్మ ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం అనేసరికి ఏకంగా మూడు జిల్లాలే అయికూర్చుంది. నాబోటి గాళ్ళే ఎగశ్వాస పీలుస్తున్నారంటే.. మీలాంటోళ్ళ విషయం చెప్పేదానికేముంది?'' అన్నాడు.

'అంటే నీ వుద్దేశం ఏందిరా వెధవా!?' అని మనసులో అనుకున్నప్పటికీ పైకి సభ్యత అడ్డువచ్చి అడగలేకపోయాడు.

''మీకైనా నాకైనా కష్టం ఒక్కటే లేండి. కాకపోతే డబ్బు దగ్గర కొంచెం అటు ఇటూ కావచ్చు.'' కటువుగా కాకపోయినా ధ్వనిగానే అన్నాను అనుకున్నాడు శంకర్.

''ఆఁ...అదే..అదే...''

''అసలైన మాట మీ నోటిగుండానే అన్నారు. అంతా డబ్బే సార్. అదీ ఇదీ అనబట్టదు. ప్రతిదానికి డబ్బు. డబ్బు.. అంతా డబ్బేసార్.. పిండికొద్ది రొట్టె! బెల్లం కొద్ది తీపు!!'' అని శంకర్ మొహం కేసి చూశాడు.

''తొందరగా చెప్పాల్సింది చెప్పి, పోరాదా – అవతల నెత్తిమీద పనులున్నాయి.'' అనే విధంగా

మొహం పెట్టాడు – శంకర్. మళ్ళీ తనే మొదలెట్టాడు మోహన్‌రెడ్డి.

"సార్...చల్లకొచ్చి ముంతదాచడం ఎందుగ్గాని.. వున్నమాట చెప్పేస్తున్నాను. మీరు ఈ ఎమ్మెల్సీ ఎలక్షన్స్‌లో దిగక వుండాల్సింది. దిగినారు. పాపం, మీ శక్తి మేర పోరాటం చేస్తున్నారు. ఇరవై లక్షలు దాక ఖర్చు పెట్టినారు. నాకు ఎట్ల తెలుసా అనుకోగాకండి. అవసరం అన్నీ తెలుసుకునేలా చేస్తుంది. నెసిసిటీ యీజ్ ద మదర్ ఆఫ్ ఇన్వెన్‌షన్. మీరేం అనుకోకండి. నేను ఒకమాట చెప్తాను. అవతల మీ యిష్టం" అని ఆగాడు.

"అదేదో చెప్పండి!" చూచాయిగా అర్థం అయినా అర్థం కానట్టే అన్నాడు శంకర్.

"మీరు చేసిన ఖర్చు ఇరవైకి ఇరవై వేసి నలబయ్‌గా ఇస్తా...మీరు పోటీ నుంచి తప్పుకుంటే.. మీ ఓట్లే నా మెజార్టీ అవుతుంది. బాగా ఆలోచించి చెప్పండి పైగా నాకు పవర్ పార్టీ సపోర్టు ప్రకటించిన విషయం మీకు తెల్సే వుంటుంది." సూటిగా చెప్పాడు.

"విత్‌డ్రాయల్స్ అన్నీ అయిపోయి నాక – ఇప్పుడు పోటీ నుంచి ఎలా తప్పుకుంటాను." అడిగాడు శంకర్.

ఒక నవ్వు నవ్వి – "నాకు ఆ మాత్రం తెలియదా! మీరు పోటీ నుంచి తప్పుకుని నాకు మద్దత్తు ప్రకటిస్తున్నట్లు మన ఇద్దరి ఫోటోలతో మొత్తం నా ఖర్చుతోనే వరుసగా మూడు రోజులు పేపర్లు అన్నింట్లో యాడ్స్ ఇస్తే సరి" అన్నాడు మోహన్‌రెడ్డి.

మనసులో ఎంత కుట్ర పెట్టుకుని వచ్చినాడు. వీడి కండ్లకు తను ఎలా అగుపిస్తున్నానో.. డబ్బు కక్కుర్తిపడే పోరంబోకు అనుకున్నాడేమో – అని మనసులో అనుకున్నాడు శంకర్.

సార్! మీరేం ఆలోచిస్తున్నారో కూడా నాకు తెలుసు. మీ పరిస్థితిలో నేను వుంటే కూడా అలానే ఆలోచిస్తాను. మీరు డబ్బుకు కక్కుర్తి పడే రకం కాదు. కాకపోతే – రాజకీయం వ్యాపారం. మీకు ఇలాగైనా లాభం డబ్బు మూలకంగా జరుగుతుంది. నాకేమో మెజార్టీ మీ ద్వారా లాభం. ఉభయ తారకంగా వుంటుందనే చెప్పాను. మీరు కాదని చెప్పినా నాకు మించి పోయిందేం లేదు. నా పద్ధతులు ఏమో నాకున్నాయనుకోండి. ఆలోచించి చెప్పండి." అని అన్నాడు మోహన్‌రెడ్డి.

"సరే! అన్నీ మీరే చెప్పేశారు. అలాంటి ఆలోచన ఏదైనా వుంటే చెప్తాను. సరేనా..." ఇక మీరు బయటికి నడవవచ్చుఅనే ధోరణిలో చెప్పాడు శంకర్.

మోహన్‌రెడ్డి లేచి బయలుదేరబోతూ–

"సార్! మీరు చెప్పదలిస్తే ఈరోజు రాత్రి ఎనిమిది గంటలలోగా చెప్పండి. తర్వాత చెప్పినా పెద్ద ప్రయోజనం వుండబోదు. వస్తాను." అంటూ బయటికి వచ్చాడు.

ఆయన వెంట – శంకర్ బయటికొచ్చాడు.

బయల్దేరేముందు శంకర్ – మోహన్‌రెడ్డి షేక్‌హ్యాండ్ యిచ్చుకుని విడిపోయారు. ఆ షేక్‌హ్యాండ్ 'సై' అంటే 'సై' అనేవిధంగా వుండింది. కానీ అప్పటికే ఫోటోగ్రాఫర్లు, ఎలక్ట్రానిక్ మీడియా కెమెరా మెన్లు ఆ ఇద్దరి షేక్‌హ్యాండ్ సన్నివేశాన్ని తమ కెమెరాల్లో బంధించారు.

మోహన్‌రెడ్డితో పాటు మీడియా వెళ్ళిపోయింది.

శంకర్‌ను అంతా అడిగారు. లోపల ఏం జరిగిందని.

"డబ్బు కొవ్వు పట్టి వచ్చినాడప్పా! పెట్టిన ఖర్చుకు డబల్ యిస్తాను – తనను సపోర్టు చేస్తున్నాని పత్రికలకు చెప్పాలంటా. నమ్ముకున్న ఇంతమందిని పోదోసి – ఈయప్ప డబ్బు కోసం కక్కుర్తి పడ్డానుకున్నాడేమో....

ఇంటికొచ్చిన మనిషి కదా అని ఆలోచించి చెప్తాను పో..ప్పా! ని సాగనంపినా. వేరే తావున అయి వుంటే గట్టిగా బుద్ధి చెప్పివుందును" సంజాయిషిలా చెప్పుకున్నాడు శంకర్.

ఆ రోజు రాత్రి 7.30 గంటలకు శంకర్ భార్య చెప్పింది. "ఎక్కడ ఎన్నికలండి. చూస్తుంటే మనకు పరిస్థితి బాగలేనట్టే కనబడతావుంది. సాకేత్ కూడా ఫోన్లో చెప్పినాడు. ఆయప్ప ఎనిమిదింటికంతా ఫోన్ చేసి ఏమాట చెప్పమన్నాడు కదా! ఫోన్‌చేసి ఒప్పుకోండి. లోకులు కాకులు. కూసుకొని కూసుకొని వూరుకుంటారు. ఇరవైకి ఇరవై ఇస్తానంటే వూరుకుంటే ఎట్లా.. ఇంగా ఎగస్ట్రా అడిగినా ఇస్తాడు. అవసరం మీదున్నోడు – ఇవ్వకుండ చస్తాడా!" అని బోధించింది.

"నీకు తోచింది నీవు చెప్పినావు కదా. ఇంగ గమ్మునవుండు. నా బాధ ఏదో నన్ను పడనీ." అని బయటికి నడిచిపోయాడు.

మోహన్‌రెడ్డి వచ్చిపోయిన మరుసటి రోజు ఉదయమే – పేపర్లలో "శంకర్ – మోహన్‌రెడ్డి మిలాఖత్" అని వార్తాకథనాలు వచ్చాయ్.

శంకర్ అగ్గిమీద గుగ్గిలం అయిపోయినాడు. మద్దత్తుదార్లు కూడా విస్తుపోయారు.

జరిగింది 'మిలాఖత్' కాదని ఎంతగా ఖండన వార్తలు యిచ్చినా జరిగిన ప్రచారం.. నష్టం జరిగిపోయింది. ఎత్తి పోసుకోవడంలోనే పోలింగ్ కూడా జరిగిపోయింది.

మోహన్‌రెడ్డి నాలుగొందల మెజార్టీతో ఎమ్మెల్సీగా ఎన్నికైపోయాడు.

చేసేదేం లేక శంకర్ హైదరాబాద్ వెళ్ళిపోయాడు – సాకేత్ వ్యాపారంలో చేదోడుకోసం.

★



## సూపర్‌స్టార్‌కు కంప్లయింట్!

బుగ్గలు గిల్లుకుని, పెదాలు కొరుక్కుని మన ప్రేమ లేందే లోకమే లేదనుకున్నంతసేపూ పరిస్థితి అంతా సవ్యంగానే సాగింది. ఎక్కడ ఏమొచ్చిందో గానీ స్పర్థలు మొదలయ్యాక తెలిసింది విరహానికి వ్యతిరేక పదమేంటో. నటుడు శింబుతో ప్రేమ వ్యవహారం తెగతెంపులయ్యాక నయనతార పరిస్థితి ఏమంత బాగోలేదని ఇండస్ట్రీలో పుకారు. అతను పదే పదే ఫోన్లు చేస్తూ, మెయిల్స్ ఇస్తూ విసిగిస్తున్నాడుట. నేను నిన్ను ప్రేమించట్లేదు బాబూ అని మొత్తుకున్నా పాత జ్ఞాపకాలను పట్టుకుని వేలాడుతున్నాడుట. ఇక ఉపేక్షిస్తే లాభం లేదనుకుని ఏకంగా సూపర్ స్టార్ రజనీకాంత్‌కు కంప్లయింట్ చేసింది నయనతార. ప్రేమా దోమా అంటూ పదే పదే విసిగిస్తున్నాడని చెప్పిందిట. దీనికి సూపర్ స్టార్ మాత్రం పెద్దరికంతో అవన్నీ నేను చూసుకుంటా... నువ్వేమీ మనసులో పెట్టుకోకుండా నీ పని నువ్వు చూసుకో అని పంపించాడుట. ఓ వైపు సినిమా షూటింగులతో బిజీగానూ, మరోవైపు శింబు వేధింపులతోనూ నిద్ర కరువైందని చెబుతోంది నయనతార. ఎంతైనా పాతస్నేహం కదా అంత సులభంగా వదులుతుందా ఏంటి!